రోడ్లపై పశువుల సంచారంతో ఇబ్బందులు

- నిత్యం తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు

భీమవరం అర్బన్: రోడ్లపై అడ్డదిడ్డంగా తిరిగే పశువుల కారణంగా నిత్యం ప్రజలకు, వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆవుల మంద కారణంగా వాహనదారులకు, ప్రయాణికులకు తమ గమ్యం చేరేందుకు ఆలస్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కొత్తపూసలమర్రు, గూట్లపాడు, దొంగపిండి, గొల్లవానితిప్ప గ్రామాల్లో మెయిన్ రోడ్‌లోనే కాకుండా ఏ వీధిలో చూసినా పశువులు దర్శనమిస్తున్నారు. ముఖ్యంగా వాహనాలపై వెళ్లే వారిని అకస్మాత్తుగా రోడ్లపైకి వచ్చి పొడిచే ప్రయత్నం చేయడంతోవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే స్కూల్‌కి వెళ్లే విద్యార్థులను కూడా కొమ్ములతో పొడిచి గాయపరుస్తున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఆవుల యజమానులు వాటిని కట్టకుండా పాలు తీసుకుని రోడ్లపైకి వదిలేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రాత్రుళ్లు రోడ్డపై పడుకోవడంతో వాటిని గమనించకపోతే ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గూట్లపాడు గ్రామంలో మెయిన్‌రోడ్డుపై సంచరిస్తున్న ఆవులు

అనాకోడేరులో వ్యక్తి మృతి

అనాకోడేరు గ్రామంలో ఇటీవల ఓ వ్యక్తిని ఆవు పొడవడంతో రెండు రోజులు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాద నేపథ్యంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి ఆవుల యజమానులకు నోటీలు ఇచ్చి బయటకు వదిలితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అయినా తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. అలాగే కొత్తపూసలమర్రు, గూట్లపాడు, గొల్లవానితిప్ప, దొంగపిండి గ్రామాల్లో మెయిన్ రోడ్లపై వందలాది ఆవులు గుంపులుగా తిరుగుతూ వాటి కొమ్ములతో దాడి చేస్తున్నాయని పలువురు గ్రామస్తులు చెబుతున్నారు.

చెరువుల గట్లపై మకాం

మండలంలో రొయ్యలు, చేపలు చెరువులు ఎక్కువగా ఉండటంతో పశుగ్రాసం కోసం ఆవులు మందలుగా గట్లపై తిరుగుతూ గట్లను ధ్వంసం చేస్తున్నాయని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందలాది ఆవులు రోడ్లపైకి వచ్చి దాడులు చేస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తున్నాయి. పశువులను గ్రామంలో లేకుండా దూరంగా తోలుకుని వెళ్లాలని లేకుంటే బందెల దొడ్డి ఏర్పాటు చేసి పశువుల యజమానులకు జరిమానాలు విధించాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వే గేటు పునఃప్రారంభం


పునఃప్రారంభమైన రైల్వే గేటు

ఉండి: రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తంగత పది రోజులుగా మూసి ఉన్న ఉండి రైల్వే గేటు ఎట్టకేలకు బుధవారం తెరచుకుంది. ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి మూసి వేసిన రైల్వే గేటును అధికారులు బుధవారం హడావుడిగా ప్రారంభించారు. అయితే ట్రాక్ మరమ్మతులు తదితర పనులు పూర్తయినా గేటు వద్ద రోడ్డు వేసే పని మాత్రం పూర్తి కాలేదు. దానిని చదును చేసిన అధికారులు రైల్వే గేటును ఓపెన్ చేశారు. దీనిని బట్టి చూస్తే మరోసారి ఒకటి లేదా రెండు రోజులపాటు గేటు మూసేసే అవకాశం ఉందని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

క్లుప్తంగా

మెరుగైన సేవలకు శిక్షణ అవసరం


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు

ఆకివీడు: మెరుగైన సేవలకు శిక్షణ అవసరం ఎంతైనా ఉందని తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన నాలుగు రోజుల శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల అభివృద్ధికి స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఆదాయ వనరులను అన్వేషించి, పలు గ్రాంటులతో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం ద్వారా మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీకర్, మండల స్థాయి అధికారులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ


శిక్షణలో పాల్గొన్న సచివాలయ సిబ్బంది

వీరవాసరం: మండల స్థాయిలో సచివాలయ సిబ్బందికి రెండు సెషన్‌లలో నాలుగు రోజుల పాటు ఎల్ఎస్‌డీజీపై శిక్షణ తరగతుల నిర్వహణ బుధవారంతో ముగిశాయి. శిక్షణ తరగతుల్లో ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్, ఏపీఎం జ్యోతిరాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీత, ఈఓ పీఆర్‌డీ ఫణీంద్ర, మత్స్యపురి కార్యదర్శి కల్యాణి తదితరులు 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, 9 థీమ్స్‌పై శిక్షణ ఇచ్చారు. గ్రామాల పురోభివృద్ధికి గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులతో కలిసి గ్రామ, మండల స్థాయి అధికారులు కృషి చేయాలని కోరారు.

ముమ్మరంగా రబీ నారుమడులు


గుత్తులవారి పాలెంలో నారుమడికి సిద్ధం చేస్తున్న వరిచేను

పాలకోడేరు: మండలంలో రబీ సీజన్‌కు సంబంధించి మండల వ్యాప్తంగా 11,500 ఎకరాల్లో వరి సాగు చేయుటకు రైతులు సిద్ధమవుతున్నట్లు మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు తెలిపారు. ఇప్పటికే మోగల్లు, వేంద్ర, కోరుకొల్లు, గరగపర్రు, కొన్ని గ్రామాల్లో రైతులు నారు మడులు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు. ఖరీఫ్‌కు సంబంధించి చాలావరకు ధాన్యం మాసూళ్లు అయినట్టు, ఇంకా అక్కడక్కడ ధాన్యం పట్టుబడులు మిగిలి ఉన్నట్టు తెలిపారు. వాతావరణంలో మార్పులవలన ధాన్యం మాసూళ్లు కొంత ఆలస్యం అయిందన్నారు. రెండు మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో ఖరీఫ్ ధాన్యం మాసూళ్లు పూర్తవుతాయని అంచనా వేస్తున్నట్లు తెలిపారు.

లంకపేటలో న్యాయవిజ్ఞాన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న సుధీర్

భీమవరం: మైనార్టీలకు విద్య, సంస్కృతి, మతం, భాష ఆధారంగా వివక్ష నుంచి స్వేచ్ఛను పొందే హక్కును రాజ్యాంగం కల్పించిందని ప్యానల్ న్యాయవాదులు ఎస్.సుధీర్, బి.సురేష్ కుమార్, ఎంబీ భవాని అన్నారు. బుధవారం మైనార్టీ హక్కుల దినోత్సవం సందర్భంగా భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం లంకపేటలోని ఆర్‌సీఎం చర్చ్ ఆవరణలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆర్.సుబ్బయ్య, ఎండీ మునవర్, డి.రవికిరణ్, కె.సుబ్బరాజు, ఆర్.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అధ్వానం

నరసాపురం: స్థానిక మున్సిపాలిటీలో మొక్కల పెంపకం కార్యక్రమం అధ్వానంగా మారింది. అధికారులు చిత్తశుద్ధి లేకుండా తూతూ మంత్రంగా కార్యక్రమం నిర్వహించడంలో ఏ మాత్రం ఉపయోగం లేకుండా పోయింది. దీంతో లక్షలు ఖర్చుపెట్టి చేపట్టిన మొక్కల పెంపకం లక్ష్యం నీరుగారుతుంది. పట్టణంలో పలు దఫాలుగా పట్టణంలో అనేక మొక్కలు నాటారు. అయితే వాటి సంరక్షణను మాత్రం గాలికి వదిలేశారు. దీంతో పట్టణంలో గోదావరి గట్టు, వైఎస్ కళాశాలరోడ్డు, ఎన్టీఆర్ కాలనీ, నందమూరి కాలనీ, బస్టాండ్ ప్రాంతం, రైల్వే స్టేషన్‌రోడ్డు ప్రాంతాల్లో నాటిన మొక్కలు కనిపించడం లేదు.

భీమవరం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి


మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్రానికి తలమానికంగా భీమవరం సుందర పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు అభివృద్ధిలో భాగస్వాములు కావాలి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ నాగరాణి భీమవరం సుందరీకరణ పనులపై జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ అధికారులతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ భీమవరం అభివృద్ధికి ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. ఇప్పటికే ఏయే ప్రాంతాలలో ఏ యే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలో? ప్రణాళికలను రూపొందించామని, ఆర్థిక వనరులను సమకూర్చేందుకు పలువురు దాతలతో కూడా చర్చించామన్నారు. ముఖ్యంగా పట్టణంలో చేపట్టే పనులకు సంబంధించిన డిజైన్లను కూడా ఖరారు చేశామని, ఇప్పటికే కొన్ని పనులను ప్రారంభించామని తెలిపారు. అమ్యూజ్మెంట్ పార్క్, లైవ్ డాల్ఫిన్స్ పార్క్ తదితర పార్కులు నిర్మాణాలతో పాటు, ఉన్న పార్కుల అభివృద్ధి, ఖాళీ ప్రదేశాల్లో, రోడ్డు కూడళ్లలో ఆకర్షణీయమైన కట్టడాలు, ఫౌంటెన్ లు, లైటింగ్, ఆర్నమెంటల్ ప్లాంట్స్ ఏర్పాటు, డివైడర్స్‌కు ఇరువైపులా అందమైన పెయింటింగ్స్, వెల్కమ్ ఆర్చిలు తదితరాల ఏర్పాటుకు ఆలోచన చేశామన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.రాహుల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, లైన్ ఇంటర్నేషనల్ కె.కృష్ణంరాజు, మున్సిపల్ ఈఈ పి.త్రినాథరావు, డీఈలు అప్పలరాజు, శ్రీనివాస్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ ఆఫీస్ వద్ద షెల్టర్ ఏర్పాటుకు చర్యలు


మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా కేంద్రం భీమవరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సుందరీకరణకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం భీమవరం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ప్రయాణికులకు, పాస్ పోర్ట్ కార్యాలయానికి వచ్చేవారికి షెల్టర్ ఏర్పాటు, జువ్వలపాలెం రోడ్డు అడ్డ వంతెన సమీపంలో బస్ షెల్టర్, ఏ ఎస్ ఆర్ నగర్ వాటర్ ట్యాంక్ ఆవరణలోని పార్కు అభివృద్ధికి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలను జారీ చేశారు. ఏఎస్‌ఆర్ నగర్ లో హెడ్ వాటర్ ట్యాంక్ ఆవరణలో పార్కు సుందరీకరణ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డిని ఆదేశించారు. ముఖ్యంగా పాత బస్టాండు ప్రయాణికులు కోసం, సమీపంలో ఉన్న పాస్‌పోర్ట్ కార్యాలయానికి సుదీర్ఘ ప్రాంతాల నుండి ప్రజలు వస్తుంటారని వారు వేచి ఉండుటకు షెల్టర్ నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని జేసీ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ ఈఈ త్రినాథరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీలక్ష్మి, డీఈ అప్పారావు ఉన్నారు.

వాస్తవ సాగుదారులకు రుణాలు అందజేయాలి

భీమవరం: జిల్లాలో కూరగాయల సాగుకు వాస్తవ సాగుదారులను గుర్తించి అమలు పరచాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖ అధికారులు ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పంటల మార్పిడి విధానంపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి మండలంలో గుర్తించిన వాస్తవ సాగుదారులందరికీ పంట రుణాలు ఇప్పించి ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన కింద రైతులని నమోదు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో పంట మార్పిడి కింద ప్రతి మండలంలో కనీసం 25 ఎకరాలలో కూరగాయల పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఆర్.దేవానంద కుమార్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కేఎస్ఎస్ శ్రీనివాస్, హరిప్రసాద్, మురళీకృష్ణ, రమేష్, అనిలకుమారి, పి.శ్రీనివాస్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ రాజకీయం చేయొద్దు


బడుగు బాలాజీ

ఉండి: సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణను రాజకీయం చేయడం తగదని వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి బడుగు బాలాజీ అన్నారు. ఏలూరు జిల్లా నూజివీడులో జరిగిన సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ రాజకీయం చేస్తున్నారంటూ బాలాజీ బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. కల్లుగీత కులాల ఆరాధ్య దైవం గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణకు హాజరైన టీడీపీ నాయకులు గౌడ సమాఖ్య జాతులైన గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశైన, యాత జాతులను తీవ్రంగా అవమానించినట్లు వ్యవహరించారని ఆరోపించారు. ప్రముఖుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు అన్ని పార్టీల నాయకులు హాజరవుతారని దానిని టీడీపీ రాజకీయంచేయడం గౌడ సమాఖ్యను అవమానించడమేనన్నారు. ఏ సామాజిక వర్గం వారైనా అన్ని పార్టీల్లోనూ ఉంటారని వైఎస్సార్‌సీపీని ప్రత్యేకంగా విమర్శించడం తగదన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి


భీమవరంలో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం: భీమవరంలో జనవరి 3వ తేది నుంచి మూడు రోజులు పాటు నిర్వహించే సీపీఎం 26వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వాసుదేవరావు కోరారు. బుధవారం పట్టణంలో ఇంటింటికీ సిపిఎం మహాసభలు ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ గడిచిన మూడేళ్ల కాలంలో సిపిఎం ప్రజాసమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. జనవరి 3న వేలాది మందితో బహిరంగ సభ జరుగుతుందని, 4,5 తేదీల్లో ప్రతినిధులు మహాసభలు జరుగుతాయని వాసుదేవరావు తెలిపారు. సీపీఎం జిల్లా నాయకులు జుత్తుగ నర్సింహమూర్తి, ఎం.వైకుంఠరావు, ఎం.ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్, సీహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి


ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ వినియోగం విడనాడి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. భీమవరం రైతు బజార్ లో శ్రీవిజ్ఞాన వేదిక, పురపాలక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రైతులు, వినియోగదారులతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ, నమూనా గుడ్డ సంచుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగం విడనాడాలని పిలుపునిచ్చారు. నిషేధిత ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం అందరి బాధ్యత అని అన్నారు. రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ పి.కళ్యాణ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ బ్యాగ్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని, గుడ్డ లేదా నారసంచులు వాడాలని సూచించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, షేక్ బేగం, చవ్వా నాగలక్ష్మి, నార్కిడిమిల్లి మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

చిట్టడవిగా మారిన మురుగు కాలువ


కాలువలో పేరుకుపోయిన కిక్కిసను అధికారులకు చూపిస్తున్న రైతులు (ఫైల్)

ఆకివీడు: పంట, మురుగు కాలువల దుస్థితిపై రైతులు అధికారులకు మొరపెట్టారు. అవిశాల మురుగు కాలువ దుస్థితిపై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు నీరు దిగువకు పారుదల లేక సుమారు 800 ఎకరాల ఆయకట్టు ముంపుకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు కాలువలో కిక్కిస, తూడు, మేటలు వేసి పూడికలు పేరుకుపోయాయని తెలిపారు. దీనిపై గతంలో అధికారులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేదని మరోసారి వాపోయారు. దీంతో గతంలో అధికారులు, రైతులు మురుగు కాలువ వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. నాలుగేళ్ల క్రితం మురుగు కాలువను తవ్వారని, మళ్లీ మేట వేసుకుపోయిందని వాపోయారు. అధికారులు మురుగు కాలువలో తాత్కాలిక పనులు చేపట్టేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తామని గతంలో చెప్పారని పలువురు రైతులు తెలిపారు. దీనిపై అధికారులు ఎప్పుడు స్పందిస్తారో తెలియడం లేదని స్థానిక రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని రైతులు వేడుకుంటున్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి

నరసాపురం: ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందివ్వాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తడి, పొడి, ప్రమాదకర చెత్తను మూడు విభాగాలుగా విభజించి సేకరిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజలు కూడా చెత్తను వేర్వేరుగా అందించి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని చెప్పారు. నరసాపురాన్ని క్లీన్ పట్టణంగా తీర్చిదిద్దే ప్రక్రియలో భాగంగా ప్రజలు సహకరించాలని కోరారు.

వెంకన్న ఆలయంలో శాంతి కల్యాణం


శాంతి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డు పద్మావతి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా బుధవారం స్వామి వారికి కాకులపాటి వీరఘవులు, నూకరాజశ్వరిదేవి దంపతులతో శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అలాగే లక్ష తులసి పూజ, అమ్మవారికి లక్ష కుంకుమార్చన, పూర్ణహూతి తదితర పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ మంతెన రామ్‌కుమార్ రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

నారుమడులు త్వరితగతిన పూర్తి చేయాలి

భీమవరం అర్బన్: దాళ్వా నారుమడులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ రైతులకు సూచించారు. బుధవారం స్థానిక విలేకరులతో నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ దాళ్వా సాగు 8 వేల 200 ఎకరాల్లో చేసే అవకాశం ఉందని చెప్పారు. సుమారు 400 ఎకరాల్లో నారుమడులలో పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటికీ 200 ఎకరాల్లో నారుమడులు పూర్తి చేశారన్నారు. మిగిలిన రైతులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే 90 శాతం సార్వా మాసూళ్లు పూర్తయ్యాయన్నారు. మిగిలిన 10 శాతం పంటకు సంబంధించిన రైతులు వాయుగుండం కారణంగా కోతలు మూడు రోజులు పాటు వాయిదా వేసుకోవాలని కోరారు.

సప్త శ్రీనివాస క్షేత్ర దర్శనానికి ప్రత్యేక సర్వీసులు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డిపో మేనేజర్ పీఎస్ విఎం సత్యనారయణ మూర్తి

భీమవరం (ప్రకాశంచౌక్): ధనుర్మాసంలో ఒకే రోజున సప్త (7) శ్రీనివాస క్షేత్రాలు దర్శించుకునేందుకు ప్రతి శనివారం ప్రత్యేక ఆర్టీసీ బస్సుల సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణ మూర్తి తెలిపారు. కలియుగం దైవం వేంకటేశ్వర స్వామి క్షేత్రాలైన అప్పనపల్లి, వాడపల్లి, ద్వారకాతిరుమల, పారిజాతగిరి దర్శనం, అబ్బిరాజు పాలెం, కొడమంచిలి, అన్నవరప్పాడు దర్శనాలకు ప్రత్యేక ఆర్టీసి బస్సు సర్వీసులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ బస్సులు ప్రతి శనివారం ఉదయం 5 గంటలకు బయలుదేరి అదే రోజున రాత్రి 8 గంటలకు డిపోకు చేరుకుంటాయని, పల్లె వెలుగు రూ.350, ఎక్స్‌ప్రెస్ రూ.400, అల్ట్రా డీలక్స్ రూ.500 చొప్పున ధరలతో ధనుర్మాస శ్రీనివాస దర్శన సర్వీసులు అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 73829 24754, 96660 89036 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వై సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

యలమంచిలి: పంచాయతీల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని పంచాయతీ కార్మికులు, ఉద్యోగుల యూనియన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలో వివిధ గ్రామాలలో బుధవారం ఆయన పర్యటించి పంచాయతీ కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా పంచాయతీ కార్మికుల వెతలు తీరడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వీపర్లు, గ్రీన్ అంబాసిడర్లు, ఎలక్ట్రీషియన్లు, ట్యాంక్ వాచర్లు, బిల్లు కలెక్టర్లు కనీస వేతనాలు లేకుండానే విధులు నిర్వహిస్తున్నారన్నారు. పంచాయతీ ఆదాయంపై ఆధారపడి వీరికి జీతాలిస్తున్నారని, పంచాయతీలకు ఆదాయం లేదనే పేరుతో అరకొర వేతనాలు ఇచ్చి పని చేయించుకోవడం సమంజసం కాదన్నారు. పండుగలు, పెళ్లిళ్లు వంటి వాటితో సంబంధం లేకుండా విధులు నిర్వహిస్తున్న కార్మికులకు తగిన విధంగా వేతనాలు ఇవ్వాలని కోరారు.

ప్రమాదకరంగా డ్రెయిన్

నరసాపురం: పట్టణంలో రాజరాజేశ్వరి థియేటర్‌కు వెళ్లే దారిలో మలుపులో ఉన్న డ్రెయిన్ ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా డ్రెయిన్‌పై మూతలు సవ్యంగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సరిగ్గా మలుపులో గొయ్యిగా ఉండటంతో అటుగా వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. పలు సినిమాహాళ్లు, ఆసుపత్రులు ఇటువైపు ఉండడంతో నిత్యం వందల మంది ఇటుగా ప్రయాణిస్తుంటారు. వారంతా భయపడుతూ అడుగులు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు ఈ అంశంపై దృష్టిపెట్టి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రకటన

[illegible] ... 675/2020, ... 80/7లో పాలకోడేరు మండలం గరగపర్రు ... [illegible]

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం.,బి.ఎల్., అడ్వకేటు, పాలకొల్లు. సెల్ : 94904 33732

వలంటీర్లపై శీతకన్ను


ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో పెంఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీర్లు (ఫైల్)

యలమంచిలి: గత ప్రభుత్వంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పని చేసిన వలంటీర్లు కూటమి ప్రభుత్వం నమ్మక ద్రోహం చేయడంతో తమ ఉద్యోగాలపై ఆశ నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రజల అవసరాలను తీర్చడంతో పారదర్శకంగా పని చేశారు. లంచాలకు తావులేకుండా ప్రభుత్వ పథకాలన్నీ నేరుగా ప్రజలకు అందజేశారు. ముఖ్యంగా కరోనా మహమ్మారి కోరలు చాచిన సమయంలో వీరి పనితీరుపై దేశ వ్యాప్తంగా ప్రశంసలు వచ్చాయి. ఎన్నికల సమయంలో వీరంతా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అనుకూలంగా పని చేస్తారని కూటమి నాయకులు ఫిర్యాదు చేయడంతో ఎన్నికల సంఘం వీరందరినీ విధుల నుంచి పక్కకు పెట్టింది. అదే సమయంలో వలంటీర్లు తమ ఉద్యోగాలపై ఆందోళన చెందవద్దని మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మిమ్మల్ని కొనసాగించడంతోపాటు రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా వలంటీర్ల ఉద్యోగ భద్రతపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అసెంబ్లీ సాక్షిగా కూటమి ప్రభుత్వ ప్రతినిధులు వలంటీర్ వ్యవస్థే లేదు కదా అంటూ మాట్లాడిన తీరుపై వలంటీర్లు మండిపడుతున్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో ప్రజలకు స్వచ్ఛందంగా సేవలు అందజేసిన 1,028 మంది వలంటీర్లు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.